Cyan




**'మాడమ్! మీరు ఇక్కడి వరకేగా టిక్కెట్టు తీసుకున్నారు, బస్సు ఇక్కణ్నుంచి మళ్లీ వెనక్కెళ్తుంది.'**

ఏవో ఆలోచనల్లో మునిగిపోయి ఉన్న మధుర కండక్టరు మాటలకి ఉలిక్కిపడింది. బస్సులో తను తప్ప ప్రయాణికు లెవరూ లేరు. బాగ్ తీసుకుని త్వరత్వరగా కిందికి దిగింది.

తనతో బస్సులో వచ్చిన వాళ్లంతా ఆసరికే ఆశ్రమం గేటు దాటి లోపలికి వెళ్లిపోయారు. వాళ్లంతా తిరిగి వెళ్లేవాళ్లు కాబట్టి వాళ్లకి తొందర. తనకేం తొందర! మధుర నెమ్మదిగా లోపలికి నడిచింది. గేటులోపల నిలబడి ఒక్కసారి పరిసరాల్ని పరికించింది. కనుచూపు ప్రసరించినంత మేరా పచ్చని చెట్లతో, అక్కడక్కడ కుటీరాలతో ఎత్తైన పర్వతాల మధ్య ఉన్న ఆశ్రమమది. చిన్నతనంలో తల్లిదండ్రుల్తో చాలా సార్లే వచ్చిందిక్కడికి.

అప్పటి కిన్ని కాటేజెస్ లేవు. అమ్మ, నాన్న అందరూ స్వామీజీ ఉద్బోధల్ని వింటూ 'హరి ఓం' నామాన్ని పలుకుతూంటే తను నాగమల్లి చెట్ల మధ్య తిరుగుతూండేది. ఆకాశాన్నంటేలా నిటారుగా నిల్చున్న నాగమల్లి చెట్లకింద, అరచేయి పట్టేంత ఒక్కొక్క నాగమల్లి పూవునూ ఏరుకుని గౌనులో నింపుకోవడం తనకెంతో ఇష్టం. ఆశ్రమానికి వెళ్లి వచ్చిన ప్రతిసారీ ఆ పూల పరిమళం కొన్ని రోజులపాటు తనని వెంటాడుతూనే ఉండేది.

స్వామీజీ స్వర్గస్థులయ్యాక ఆయన శిష్యురాలు మాతృశ్రీ నడుపుతున్నారట ఆశ్రమాన్ని.

"రండమ్మా... అక్కడే నిలబడి పోయారేం?" తెల్లని వస్త్రాలు ధరించిన ఒక మహిళ అడుగుతోంది.

మధుర తడబడి కుడిభుజాని కున్న బాగ్‌ను ఎడం భుజానికి మార్చుకుంది. కుడివైపు 'ఆఫీస్' అని బోర్డున్న వైపు నడిచి నాలుగైదు మెట్లెక్కి అక్కడున్న బెంచి మీద కూర్చుంది. తనకన్నా ముందొచ్చిన మరో నలుగురు ఆఫీస్ రూం కిటికీ దగ్గర క్యూలాగా నిల్చున్నారు. కాషాయ వస్త్రాల్లో ఉన్న స్వాములు ఇద్దరు పక్కనే పాఠశాల అని బోర్డు ఉన్న లోగిలి లోంచి బైటికి వచ్చి, కుటీరాల వైపుగా వెళ్లిపోయారు.

మధుర కింకా మనసులోని డైలమా తొలగిపోలేదు. తను చేసిన ఈ పని మంచిదేనా, కాదా అని ఆలోచిస్తూనే ఉంది.

"అమ్మా! మీరేనా మధుర?"



**అప్పాజోస్యుల-విష్ణుభొట్ల ఫౌండేషన్ (యు.ఎస్.ఎ.), ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటీలో రు. 10,000/- గెలుచుకున్న కథలలో నాలుగవది**

"ఆ. అవును."

"ఇదిగో, ఈ ఫారాన్ని నింపి ఇవ్వండి." -

పేరు, ఊరు అన్నీ ఫిలప్ చేసింది. 'వయసు' అని ఉన్నచోట తన వయసుకు మరో ఐదేళ్లు కలిపి యాభై అని రాసింది. యాభై నిండకపోతే ఆశ్రమంలో ఉండనివ్వరు.

'ఆశ్రమంలో ఎన్నాళ్లుంటారు?' అన్న చోట కలం ఆగిపోయింది. ఏం రాయాలా అని ఆమె ఆలోచిస్తూండగా "ఫర్వాలేదు, ఎన్నాళ్లైనా రాయండి, రెండు నెలలు మించకుండా..."

"అంతకు మించి ఉండకూడదా?"

"దానికి వేరే నియమాలేవో ఉన్నాయి. మాతృశ్రీ అనుమతి పొందాల్సి ఉంటుంది."


"సరే ఇప్పుడు డబ్బేమైనా..." అంత ప్రశాంతమైన ప్రదేశంలో డబ్బును గురించి మాట్లాడడానికి సంశయం కలిగిందెందుకో.

"అదేం లేదమ్మా, మీ రిక్కడ ప్రశాంతంగా గడపండి. వెళ్లేముందు మీకు కలిగితే తోచినంత ఆశ్రమం హుండీలో వెయ్యండి. అదెంత తక్కువైనా ఫర్వాలేదు- కేవలం ఆశ్రమ పాఠశాల నిర్వహణకు మాత్రమే. ముఖ్యంగా ఈ పత్రంలో ఉన్న నియమాలన్నీ క్రమం తప్పకుండా ఆచరించండి. మాతృశ్రీకి మీపైన అనుగ్రహం కలిగితే మీ కిక్కడ శాశ్వతంగా స్థానం దొరుకుతుంది." ఆ పెద్దాయన కరుణ ఉట్టిపడే కంఠంతో చెప్పి, "మాతా! ఈ మాతను వారికి కేటాయించిన కుటీరానికి తీసుకెళ్లండి" అన్నారు.

అక్కడ మొక్కలకు నీళ్లు పెడుతున్న ఒకామె వచ్చి మధురను వెంటబెట్టుకుని వెళ్లింది.

ఆశ్రమంలో ప్రవేశానికి ముందుగా అనుమతి కోసం ఉత్తరం రాసినప్పుడే వాళ్లు తిరుగు టపాలో అక్కడ పాటించాల్సిన నియమాల పాంప్లెట్‌ని పంపించారు. అది ఈసరికే ఆమెకి కంఠోపాఠమై పోవడంవల్ల దాన్ని తెరిచి చూడాల్సిన అవసరం లేక మడతపెట్టి పర్స్‌లో పెట్టేసింది.

మామిడి తోటలో అక్కడక్కడ దూరదూరంగా




కాటేజెస్ ఉన్నాయి. ఒకరి నుంచి మరొకరికి డిస్టర్బెన్స్ కాకూడదని కాబోలు ఒక్కొక్క రూమ్‌ను మాత్రం ఒక్కొక్క కాటేజ్‌గా కట్టారు.

రూమ్ తలుపు తెరిచి, ఆరు గంటలకల్లా ప్రేయర్ హాల్‌కి తీసుకెళ్తాను, సిద్ధంగా ఉండ మని చెప్పి ఆమె వెళ్లి పోయింది.

గదిలో చాప, వ్యాసపీఠంపైన భగవద్గీత, నీళ్ల కూజా, గ్లాసు ఉన్నాయి. బాత్‌రూంలో ఓ ప్లాస్టిక్ బకెట్టు, మగ్గు ఉన్నాయి.

మధుర బాగ్‌ను మంచంపైన పెట్టి అలసటగా చాపమీద వాలిపోయింది.

ఉదయం నుంచి ఆపుకుంటున్న ఉద్వేగం, దుఃఖం ఒక్కసారిగా ఆమెను ఆవరించుకున్నాయి. కళ్లు జలపాతా లయ్యాయి. ఎంతసేపు అలా ఏడుస్తూ ఉండిపోయిందో ఆమెకే తెలీలేదు.

సూర్యబింబం పడమటి కొండల వెనక నిష్క్రమించడానికి సన్నద్ధమౌతోంది.

ఆరుగంటలకి ఆమెని పిలుచుకెళ్లాలని వచ్చిన మాత ఆమె ఏడుస్తూండటం చూసి దుఃఖోపశమనం కానిమ్మని వెళ్లిపోయింది. తిరిగి ఏడు గంటలకి భోజనానికి పిలుచుకెళ్లాలని వచ్చేసరికి మధుర గాఢమైన నిద్రలో ఉంది. ఆమెకు నిద్రాభంగం కానివ్వకుండా తలుపు దగ్గరగా చేరవేసి వెళ్లిపోయింది.

పక్షుల కలరవాలకి తెలతెలవారుతూండగా మెలకువ వచ్చింది మధురకి. తనెక్కడుందో గుర్తుకొచ్చి ఒక్క ఉదుటున లేచి కూర్చుంది. గదిలో చిన్నగా వెలుగుతూన్న బెడ్‌రూం బల్బ్. ఎక్కణ్నుంచో పూల పరిమళాన్ని మోసుకొచ్చిన చిరు తెమ్మెర కిటికీలోంచి లోపలికొచ్చి మృదువుగా పలకరించింది. రాత్రి తనివితీరా ఏడవడం వలన కాబోలు మనసు కొంత తేలికైనట్లుంది.

తలుపు తీసుకుని గదిలోంచి బైటికొచ్చింది మధుర.

గుమ్మం ముందు నందివర్ధనం పూల పాద తెల్లని నక్షత్రాల్లాంటి పూలతో ఒళ్లంతా అలంకరించుకుని ఉంది. ఆ పక్కనే పారిజాతం చెట్టు పూలను ఉండుండి జలజలమని రాలుస్తూ నేలతల్లిని పూజిస్తోంది. దూరంగా ఏదో కాటేజ్‌లోంచి 'హరి ఓం' శబ్దం మంద్రంగా గాలిలో తేలి వస్తోంది. జామ చెట్లమీది చిలకల గుంపులు ఒక దాన్నొకటి తరుముతూ, కవ్విస్తూ రెక్కల్ని టపటపలాడిస్తూ ఆనందాన్ని వెలారుస్తున్నాయి. మామిడి కొమ్మల్లోంచి కోయి లొకటి ఆగి ఆగి మార్దవంగా రాగం తీస్తోంది.

ఉదయం ఐదు గంటలకల్లా ప్రార్థనా మందిరంలో అటెండ్ కావాలనే నియమం గుర్తుకొచ్చి మధుర స్నానం చేసి తెల్లచీర, తెల్ల బ్లౌజ్ వేసుకుంది. ఉన్నవన్నీ రంగు చీరలే కావడంతో భర్తపోయిన ఈ రెండు నెలల్లోనూ తెల్ల చీరలు కట్టలేదు మధుర. ఇప్పుడిలా రావడం కోసమని రెండు తెల్ల చీరలు కొని తెచ్చుకుంది.

భగవద్గీతను చేతిలోకి తీసుకుంది. కాలిబాట మీద నాలుగడుగులు నడిచాక 'ప్రార్థనా మందిరానికి దారి' అంటూ బాణం గుర్తు వేసి ఉన్న బోర్డు కనిపించింది కుడివైపు. అక్కడి వరకూ వచ్చాక ఎందుకో అటు వెళ్లాలనిపించలేదు మధురకు. ఎడమ పక్క బాట మీద నడవ సాగింది. నాలుగడుగులు నడిచేసరికి గులక రాళ్లమీద గలగలా పారుతూన్న సెలయేరు, దాని మీదుగా వేసిన చిన్న వంతెన వచ్చింది. ఆ వంతెన మీదుగా కొండపైకి పోయే బాటవెంట వెళ్లేసరికి బాట మధ్యలో పెద్ద ఉసిరి చెట్టు, దాని మొదట్లో విశాలమైన చప్టా, దానిమీద ఓ సిమెంటు సోఫా కన్పించాయి. ఇంక నడవ లేననిపించి వెళ్లి ఆ సోఫాలో కూర్చుంది మధుర.

ఆసరికి పూర్తిగా వెలుగు రేఖలు లోకం మీద పరుచుకున్నాయి.

ఆశ్రమ నియమం కోసం చెప్పులేసుకోకుండా వచ్చింది. గులకరాళ్లు గుచ్చుకుని పాదాలు నొప్పులు పెడుతున్నాయి. ఆ కాస్త నడకకే పాదాలలోకి రక్తం పొంగివచ్చి సలపరం పెడుతోంది. ఆయాసంగా అన్పించి మెడ వెనక్కి వాల్చి సోఫాలో చేరబడి పోయింది. ఆ అలసట వయసు ప్రభావమో, మనసు ప్రభావమో ఆమెకి అర్థం కాలేదు.

పడమటి వైపు బాట పక్కన ఆలయం కాబోలు ఉంది. ఆ ఆలయ శిఖరం మీద ఓం అనే అక్షరం పెద్దగా రంగుల్లో చెక్కబడి ఉంది. దాన్ని చూడగానే అసంకల్పితంగా తను ఆశ్రమాని కెందుకొచ్చిందో గుర్తొచ్చింది.

భరించలేని ఒంటరితనం నుంచి దూరంగా పారిపోవాలని ఇక్కడికి వచ్చి చేరుకుంది.

కళ్లద్దాల్ని తుడిచి పెట్టుకుని భగవద్గీతలో చేతికొచ్చిన పేజీ తెరిచింది.

**-శ్రుతి విప్రతిపన్నా తే యదాస్థాస్యతి నిశ్చలా**
**సమాధా వచలా బుద్ధిస్తదా యోగ మవాప్స్యసి**

మధుర ఆశ్చర్యంతో తల మునకలైంది. తన మనస్థితి తెలిసినట్టు ఈ శ్లోకం వచ్చిందేమిటి?

చిన్నతనంలో తండ్రి గీతా శ్లోకాల్ని చదివి అర్థం చెప్పడం గుర్తుకొచ్చింది. 'గీతను తెరిచినప్పుడు అప్పటి మన మనస్థితికి అన్వయించే శ్లోకాలే వస్తాయి' అంటూండేవా డాయన. 'నానా విధములైన శ్రవణాదుల చేత కలతచెంది ఉన్న నీ బుద్ధి ఎప్పుడైతే చలించకుండా పరమాత్మధ్యానంలో స్థిరంగా నిలిచి ఉంటుందో, అప్పుడు నీకు ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది.'

తూర్పు గోదావరి జిల్లాలోని ఈ తోటపల్లి కొండల శిఖరాల్ని దూరం నుంచి చూస్తూనే పెరిగింది మధుర. ప్రతి ఏటా భీష్మ ఏకాదశికి బండి కట్టుకుని అన్నవరం రావడం, అమ్మానాన్నా వ్రతం చేయించుకోవడం, దేశంలో మరే ఆలయంలోనూ దొరకని మధురమైన ప్రసాదాన్ని ఎంత తిన్నా ఇంకా తినాలన్పించడం, తిరిగి వస్తూ బెండపూడి సాధువుగారి ఆశ్రమంలో మజిలీ చెయ్యడం, అక్కడ అప్పట్లో రోజా వందలాది మందికి జరిగే షడ్రసోపేతమైన అన్నసంతర్పణలో

కులమత బేదాలు లేకుండా భోజనాలు చెయ్యడం, ఆ తర్వాత సాధువుగారు చీకటి గదిలో వరసగా నిల్చున్న తన ఏడుగురు భార్యల్నీ హరికేన్ లాంతరు వెలుగులో ఆడవాళ్లకు మాత్రమే చూపించడం, వాళ్ల ఒళ్లంతా బంగారు నగల్తో ధగధగలాడడం... అవన్నీ ఆమెకింకా కళ్లకు కట్టినట్టే గుర్తున్నాయి.

లేకలేక కలిగిన ఏకైక సంతానం కావడం వల్లనో, ఏమో తండ్రికి మధురంటే ఎంతో అనురాగం. మీనాక్షీ ఆలయానికి వెళ్లొచ్చాక పుట్టడం వలన కూతురికి మధుర అని పేరు పెట్టారు. ఏడెనిమిదేళ్లు వచ్చేవరకూ తండ్రి ఆమెను నేలమీద నడవనీయలేదు.

"అది ఆడపిల్ల, మరో ఇంటి కెళ్లాల్సిందాన్ని ఇలా పెంచితే ఇంకేమైనా ఉందా" అని తల్లి అప్పుడప్పుడూ రాగాలు తీయడం, తండ్రి ఆమెను మందలించి తనను నెత్తికెక్కించుకోవడం అంతా గుర్తే మధురకి. తనకి ఒంటరితనం తెలియకూడదని అత్తయ్యల పిల్లల్నీ, బాబాయిల పిల్లల్నీ, బంధువర్గంలో ఎందరి పిల్లల్నో తమ ఇంట్లోనే తనతో బాటే పెంచారు. తను పుట్టక ముందే పెద్దత్తయ్య కొడుకును కని పురిట్లోనే పోవడంతో ఆమె కొడుకు సుధాకరం ముందే ఇంట్లో ఉండేవాడు.

తను పదోతరగతి చదివే నాటికి ఏం జరిగిందో తెలీదు కాని అరవై ఎకరాల మాగాణి ఆరెకరాలైంది. ఆర్థికంగా తమ కుటుంబం కుంటుపడింది. అప్పుడిక చదువులు ముగిసి కొందరూ, ముగియక కొందరూ ఎవరి పిల్లలు వాళ్లింటికి చేరుకున్నారు.

పరిస్థితి ఈ మాత్రమైనా ఉండగానే పిల్ల పెళ్లి చెయ్యండని అమ్మ పట్టుపట్టడంతో సుధాకరంతో తన పెళ్లి జరిపించారు. అతనికి చిన్నప్పట్నుంచీ తనంటే ఇష్టంలేదు. 'నువ్వు పుట్టకుండా ఉంటే పెద్ద మామయ్య నన్ను దత్తత చేసుకుని ఈ ఆస్తంతా నాకే ఇచ్చేవాడు తెల్సా' అనేవాడు.

పెళ్లిలో నాలుగెకరాలు తన పేరుతో రాసిచ్చారు. సుధాకరం అప్పటికి పాలిటెక్నిక్ డిప్లొమా పాసై ఏదో ప్రైవేటు కంపెనీలో చేస్తూ ఉండేవాడు. అప్పటికి టెక్నికల్ స్టాఫ్ కున్న మంచి అవకాశాల వలన తర్వాత మంచి ఉద్యోగంలో సెటిలై బాగా ఎదిగాడు. ఉద్యోగంతోబాటు అతని అలవాట్లూ ఎదిగాయి. ఫలితంగా సంపాదించిందంతా క్లబ్బులకీ, పార్టీలకీ తగలేస్తూ ఉండేవాడు. తనేమైనా అంటే నా సంపాదన నా ఇష్టం అంటూ గొడవకు దిగేవాడు. "ఎందుకూ పనికి రాని నాలుగెకరాల్తో నిన్ను నా మెడకి గుదిబండలా తగిలించాడు మీనాన్న. నలుగురితో బాటు కాస్త తిండి పడేసి చవగ్గా అల్లుణ్ని కొట్టేశాడు. ఎవడి కోసం పోషిస్తాడు! డబ్బు పంపించమను" అంటూండేవాడు.

తండ్రి నేమైనా అంటే మధుర సహించలేకపోయేది.

తన పొలం మీద వచ్చిన ఫలసాయంతో ఇంటి అవసరాలన్నీ తనే చూసుకోవాల్సి వచ్చేది. వర్షాధార భూమి కావడం వలన పండీపండకా నానా పాట్లు అయ్యేది. అతను మాత్రం నిమ్మకు నీరెత్తి నట్టుండేవాడు. గొడవ పెట్టుకుని ఇంటిని వీధిలో పెట్టుకోలేక, ఇద్దరు పిల్లల్ని పెంచే మార్గం కానరాక నానా హింస అనుభవించింది తను. బెంగతో నాన్నగారు మంచం పట్టి త్వరలోనే కాలం చేశారు. ఆ ఊళ్లో పాత ఇంటినీ, రెండెకరాల భూమినీ అమ్మేసి ఆ డబ్బుతో అమ్మ తన ఇంటికే వచ్చేసింది. ఆమె తెచ్చిన డబ్బు, ఆమె ఒంటిమీది కొద్దిపాటి బంగారం తనే అవసరాలకి వాడేసుకుంది. భర్త ఆ తీరు కావడంతో పిల్లలిద్దర్నీ రెండు కళ్లనుకుని పెంచింది మధుర. అమ్మాయిని డిగ్రీ చదివించింది. ఆ తర్వాత ఇంక చదవనని అది మొండికేసింది. ఈలోగా భూముల రేట్లు పెరిగాయి. రెండెకరాలు అమ్మి, కాస్త మంచి సంబంధం అనుకున్నది చూసి అమ్మాయి పెళ్లి జరిపించింది.

మరో రెండెకరాలు కొడుకు ఇంజనీరింగ్ చదువుకు ఖర్చైంది. ఈ రెండు పనులూ చెప్పినంత తేలిగ్గా పూర్తి కాలేదు. మగవాళ్లైతే 'చెప్పులరిగేలా తిరిగాం' అని చెప్పుకోగలరు. అమ్మాయి పెళ్లి కుదిరే వరకూ మధుర ఎన్నిపాట్లు పడిందో ఆమెకే తెలుసు. ఇక కిరణ్ చదువు - వాణ్ని ఇంజనీర్‌ని చెయ్యడానికి ఎక్కడ కోచింగ్ బావుందంటే అక్కడల్లా డబ్బుకట్టి, వాణ్ని వెంటబెట్టుకుని తిరిగింది. వాడు ఇంజనీరుగా సెటిలయ్యేవరకూ ఎంతో హైరానా పడింది.


ఉద్యోగంలో జాయినయ్యాక కిరణ్ పెళ్లి చేసుకుని అత్తవారి కాంట్రాక్ట్ బిజినెస్‌లో పార్టనర్ అయ్యాడు.

ఆసరికి సుధాకరానికి కాలూ చెయ్యీ పటుత్వం తగ్గాయి. తిరుగుళ్లు తగ్గించాడు. ఏం లాభం, రిటైరవుతూనే మంచమెక్కాడు. అతనికి ఆఫీసు వాళ్లిచ్చిన డబ్బు అతని కాన్సరు జబ్బు తినేసింది.

తండ్రి జబ్బుతో ఉన్నప్పుడు చూడ్డానికి వచ్చిన కూతురు 'చంటిపిల్లతో ఒక్కదాన్నీ చేసుకోలేక పోతున్నానని' అమ్మమ్మను వెంటబెట్టుకెళ్లింది. భర్తపోయి దినకార్యం ముగిసి, అందరూ వెళ్లాక ఆ రాత్రి కొడుకు అడిగాడు-"అమ్మా! ఇప్పుడు మూఢం, నిన్ను మా వెంట తీసుకెళ్లకూడదట. రెండు నెలలు ఓపిక పట్టు, మూడో నెలలో వచ్చి తీసుకెళ్తాను. ఈ లోపల అమ్మమ్మ నీకు బట్టలు పెట్టాలట. ఆ ఫార్మాలిటీస్ ఏవో ముగిస్తే నువ్వు మాతోనే ఉందువుగాని. ఈలోగా నీ దగ్గరున్న డబ్బు ఇంటద్దెకీ దానికీ సరిపోతుందనుకుంటాను, బాంకులో ఏమాత్రం ఉంది?" అన్నాడు.

జవాబుగా తను పాస్‌బుక్కు తెచ్చి అతని చేతి కిచ్చింది. దాన్లో ఐదువేలు మాత్రం ఉన్నాయి.

"ఏంటీ, నాన్నగారికొచ్చిన డబ్బంతా ఖర్చు పెట్టేశావా?" కోపంగా ఎర్రబడిన కొడుకు మొహాన్ని చూసి చిన్నబుచ్చుకుంది మధుర. తప్పని సరిగా సమాధానం చెప్పాల్సి వచ్చింది. "ఆయన కోసమే కదరా... అనారోగ్యంతో మనిషి మంచమెక్కితే చూస్తూ ఎలా ఊరుకోగలం? ఇంట్లో ఉన్న కొద్దో గొప్పో సొమ్ము కాస్తా ఈ పది రోజుల్నుంచీ ఖర్చైపోయింది. ఆయన చేసిన అప్పులు పోను చేతి కెంతొచ్చిందనీ" ఇప్పుడే డబ్బు విషయాలు మాట్లాడుకోవడం ఏమీ బాగాలేదు మధురకు.



# ఆరంగేట్రం

పొద్దున్నే చినుకు చంటిది
బొంతను తడిపేసింది
తీగెల మీద నడకలు నేర్చుకుని
దుమ్మూ దుమారంతో గంతులేసింది
నీటి అద్దాల్ని అమర్చి
ఆకాశ ప్రతిబింబాన్ని
అన్ని వైపులా నాట్యీకరిస్తూ
గజ్జె కట్టి ఆడింది

చూడని కన్ను చూపొచ్చింది
మూగ భూమికి మాటొచ్చింది
పక్షులు కరపత్రాలై ఎగిరిపోతే
చెట్లన్నీ పింఛాలెత్తి నర్తిస్తుంటే
పుట్టా గుట్టా జాతరైంది

ప్రతి ఏటా వచ్చినట్టే
ఈ యేడూ మట్టి వాసన
మహాద్భుతంగా ఉంది
భావప్రాప్తి పొందేది అప్పడే
అనుభూతి గరిక పోచల
అంకురార్పణ జరిగేది అప్పడే!
భూమి పుటలన్నీ నింపుతూ తొలకరి
మట్టి మీద మహాకావ్యం రాస్తుంది.

కందుకూరి శ్రీరాములు

"ఏం తెలివి తక్కువ తనమమ్మా ఇది... ఆ మహానుభావుడు ఏనాడైనా మాకోసం ఏమైనా చేశాడా? కనీసం రిటైర్మెంటు సొమ్ము కూడా మాకు దక్కకుండా చేశావన్నమాట! అసలు కాన్సరొచ్చిన మనిషి బతుకుతాడని ఎలా అనుకున్నావ్, వైద్యాని కింత ఖర్చు పెట్టేశావు! ఎప్పుడూ ఇదే పద్ధతి చేశావు. మగాడి నెలా దార్లో పెట్టుకోవాలో తెలీకుండా పౌరుషం, గాడిద గుడ్డూ అని సంపాదిస్తున్న మనిషిని ఇంటికి ఉపయోగపడకుండా చేశావు. మొదట్లోనే నువ్వు అతన్ని మార్చడానికి ట్రై చేసి ఉంటే ఈరోజిలా ఇల్లూ వాకిలీ లేకుండా వీధిలో నిలబడేదానివా? ఓ పక్కన తాతయ్యిచ్చిన భూమంతా అమ్మి తగలేశావు. అటు అమ్మమ్మ తెచ్చిందీ ఖర్చు పెట్టేశావు. ఇప్పుడు అమ్మమ్మ నీకు బట్టలు పెట్టాలన్నా నేనో, జ్యోతో కొనివ్వాల్సిందే కదా! అందుకే ఊరికే అన్నారా-ఆడపెత్తనం బోడి పెత్తనమని?!"

మధుర నిలువునా నీరైపోయింది.

తన కొడుకు, తను ప్రాణప్రదంగా పెంచిన కిరణ్ ఇలా మాట్లాడుతున్నాడా!

భర్త పోయినప్పుడు కూడా రాని ఏడుపు ఇప్పుడు ముంచుకొచ్చింది. భోరుమని ఏడుస్తూ నేలమీద ఒరిగిపోయింది మధుర.

"ఏవిటి? కిరణ్! నువ్వు మరీనూ... ఈ పది రోజుల్నుంచీ కంట తడిపెట్టని ఆవిడ ఇప్పుడిలా ఏడుస్తూంటే మనం ఏదో చేశామనుకోగలరు ఇరుగూ పొరుగూ అంతా. నీకు డబ్బులేదని నేనుగానీ, మా డాడీగానీ ఎప్పుడైనా అన్నామా? ఎందుకు అనవసరంగా వర్రీ కావడం" అంటోంది కోడలు.

"నా కోసమేం కాదు, ఆవిడకింకా గడపాల్సిన కాలం ఎంత లేదూ!"

"అమ్మా! పొద్దుపోతే మీ ఇంట్లో మేం ఉండకూడదట, మేం బయలు దేరుతున్నాం మరి" అని కూతురన్నప్పుడు మనసు చివుక్కుమన్పించినా, 'అది సహజంలే' అని సరిపెట్టుకుంది. కానీ తన బతుకును కడతేరుస్తా డనుకున్న కొడుకు ఈ తీరున మాట్లాడేసరికి ఆమె జీర్ణించుకోలేక పోతోంది.

మర్నాడే కొడుకూ, కోడలూ వెళ్లిపోయారు.

అప్పట్నుంచే భరించలేని ఒంటరితనంలో మధుర మగ్గిపోవడం మొదలైంది. ఇది వరకంతా పిల్లలు దూరంగా ఉన్నా 'వాళ్లు నా వాళ్లు' అనే ధీమా ఉండేది. ఇప్పు డా ధైర్యం నశించి ఆమెని ఏకాకిని చేసి నిలబెట్టింది.

ఒకానొక సందర్భంలో మనసు మరీ నిలకడ తప్పిపోయి ఆత్మహత్య చేసుకోవా లన్పించింది.

నలభై దాటాక అది సహజమనీ, దాన్ని అధిగమించే ప్రయత్నం చెయ్యాలి తప్ప డిప్రెస్ కాకూడదని ఎక్కడో చదివింది. అందుకే ఆశ్రమ వాతావరణంలో, ఆధ్యాత్మిక ధ్యానంలో పునర్జన్మ పొందాలని వచ్చింది.

"ఈ టైంలో ప్రేయర్ హాల్లో ఉండాలి. మీ రిక్కడ నిద్ర పోతున్నారేంటి?" భుజం పట్టి కుదిపి అడుగుతోంది ఒక మాత.

మధుర తడబడి లేచి నిల్చుంది. 'వెళ్తాను' అంది.

"ధ్యానం ముగిసింది లెండి, కాస్త అల్పాహారం చేసి వద్దాం రండి. నేనూ అటే వెళ్తున్నాను" అందామె, మధుర చెంపల మీద చారికలు కట్టిన కన్నీళ్లని పరిశీలనగా చూస్తూ.

మధుర కళ్లు దించుకుని ఆమె వెనక మౌనంగా నడిచింది.

"ఇక్కడి నియమాల్ని సరిగా పాటించకపోతే త్వరలోనే మిమ్మల్ని పంపించేస్తారు. ఆశ్రమంలో ఎవరేం చేస్తున్నారో మాతృశ్రీకి ఎప్పటి కప్పుడు తెలుస్తుంది."

ఆ సాయంకాలం తప్పనిసరిగా ధ్యాన మందిరానికి హాజరైంది మధుర. స్వాములు, మాతలు... అంతా కలిసి పూర్తిగా ఇరవై మంది కూడా లేరు. అందరూ బాగా వయసు మళ్లిన వారే. ఎవరికి వారు మౌనంగా కళ్లు మూసుకుని కూర్చుని ధ్యానం చేసుకుంటున్నారు.

చిన్న ఆసనం మీద కూర్చున్న ఆమెను చూపించి ఆవిడే మాతృశ్రీ అని చెవిలో చెప్పింది మధురతో వచ్చిన మాత.

పచ్చని శరీర ఛాయ, పూర్తిగా తెల్లబడిన జుట్టు, ఒత్తైన కనురెప్పలు - ఆమె వయసెంత ఉంటుందో కాని, ఆరోగ్యంగా, చూసే కొద్దీ చూడాలన్పించేంత ప్రశాంతంగా ఉందామె ముఖ వర్చస్సు.

అందర్లాగే తనూ పద్మాసనంలో కూర్చోవాలనీ,

ధ్యానం చెయ్యాలనీ ప్రయత్నించింది మధుర. ఆమె శరీరమూ, మనసూ ఏ మాత్రమూ సహకరించలేదు. పద్మాసనంలో కూర్చోవడం అనుకున్నంత తేలిక కాదని తేలిపోయాక మధుర మాతృశ్రీనే చూస్తూ కూర్చుంది. ఆ రోజు ధ్యానం ముగిశాక మాతృశ్రీ కళ్లు తెరిచి మధురను చూసి చిరునవ్వు నవ్వింది. దగ్గరకు రమ్మని సైగ చేసింది. మధుర వెళ్లి ఆమెకు దగ్గరగా కూర్చుంది.

అందరూ లేచి భోజనశాలవైపు వెళ్లాక మాతృశ్రీ మధుర తల మీద చెయ్యి వేసి నిమిరింది. "అప్పుడే ఎందుకమ్మా ఇక్కడి కొచ్చావు?" అంది ఆదరంగా.

ఆ కాస్త పలకరింపుతోనే మధురలో దుఃఖం కట్టలు తెంచుకుని వరదలై పొంగింది.

దుఃఖం ఉధృతి పూర్తిగా తగ్గేవరకూ ఏడవనిచ్చి "చూశావా, నీ వాళ్లందర్నించీ విడిపోయి వచ్చేశానని అనుకుంటున్నావు? నీ మనసు మాత్రం దాని కంగీకరించడం లేదు. అందుకే నీకింత దుఃఖం కలుగుతోంది. కష్టాల్లో, సుఖాల్లో సంసార జంఝాటం లోని అనుభూతుల్లోంచి బైట పడేందుకు హృదయం ఒకటే కొట్టు మిట్టాడుతుంది. అనుభవాలతో పండిపోతేనేకాని నీ హృదయం నీ మాట వినదు, నీకు సహకరించదు. అందుకే ఇక్కడ ఉండాలన్పించినన్నాళ్లు ఉండి, తిరిగి వెళ్లు. ఒక్కటి గుర్తుంచుకో, నీ ఒంట్లో శక్తి ఉంది. దీనులకూ ఆర్తులకూ నీలాంటి వాళ్లసేవ అవసరం ఉంది. మానవసేవే మాధవ సేవ అనుకున్నప్పుడు నిన్ను ఒంటరితనం బాధించదు." అంది మాతృశ్రీ.

పదిరోజులు గడచి పోయాయి. మనసును ధ్యానం మీదికీ, కనిపించని అంతర్యామి మీదికీ మళ్లించాలని ఎంతో ప్రయత్నిస్తోంది మధుర. ఇంట్లో తనని బాధిస్తున్న ఏకాంతమే ఇక్కడా వదలడం లేదు.

క్రమంగా మధురకి విసుగెత్తి పోయింది. చెయ్యడాని కే పనీ లేదు. తను గెస్టుగా వచ్చింది కాబట్టి వంటశాలలాంటి చోట్ల పని చేసేందుకూ లేదు. ఎంత సేపూ అవే చెట్లూ, చేమలూ, కొండలూ రాళ్లూ, అవే వాడిపోయిన ముఖాలు చూసి చూసి విసుగెత్తి పోయింది. వచ్చిన రోజు ఎంతో అందంగా కన్పించిన ఆ పరిసరాలు ఇప్పుడు భయపెడుతున్నాయి. జీవితం చైతన్యాన్ని కోల్పోయి బండబారి పోతూన్న అనుభూతి.

హఠాత్తుగా ఆమె మనసు మనవరాలి మీదికి పోయింది. అది పుట్టాక కూతురి మీదికన్నా దానిమీద ప్రేమే అధికమైంది తనకి. ఇప్పటికిప్పుడు వెళ్లి చూడాలన్పించింది.

మాతృశ్రీ ఏకాంత ధ్యానంలో ఉండే టైం కాబట్టి ఆఫీస్ రూంలో స్వామీజీకి మాత్రం చెప్పేసి బాగ్ తీసుకుని బస్సెక్కింది మధుర.

పొద్దుపోయి చెప్పా పెట్టకుండా వచ్చిన తల్లిని చూసి ఆశ్చర్యపోయింది జ్యోతి.

"అదేంటమ్మా, ఒక్క ఉత్తరమ్మైనా రాయకుండా వచ్చేశావు" అంది చేతిలోని బాగ్ అందుకుంటూ. "ఫస్టెళ్లాక మేమే పిలుద్దాం అనుకుంటున్నాం. అమ్మమ్మ నీకు బట్టలు పెట్టాలట కదా!"

"అవునే మధురా, వారం వర్జ్యం చూసుకో నక్కర్లేదూ? కొత్తగా భర్త పోయినదానివి, ఇలా వచ్చెయ్యడమే పిలవకుండా" అంది ముసలావిడ.

చాన్నాళ్లకి ఆరోజు నవ్వింది మధుర. "భర్తంటే భరించేవాడే అయితే కొత్తగా ఎందుకొతుంది. నా భర్త పోయి చాలా కాలమైంది. నా కెవ్వరూ ఏ బట్టలూ పెట్టనక్కర్లేదు. ఇదిగో చూశావా, నేనే కొనుక్కున్నాను నీ పేరు చెప్పి రెండు తెల్ల చీరలు. అయినా నువ్వు కొన్నా-నేను కొన్నా ఒకటే కదమ్మా. నేను ఈ బంగారు తల్లిని చూడాలని వచ్చాను, మీ కోసం కాదు." అంది నిద్రపోతూన్న మనవరాల్ని లేవదీసి ఎత్తుకుంటూ.

రెండు రోజుల తర్వాత మధుర వెళ్లడానికి

DAP బ్రాహ్మీవిట
గ్రాన్యూల్స్
శంఖపుష్పి బ్రాహ్మీల మిశ్రమం
- బ్రాహ్మీవీటా చాతుర్యం
- చదివిన ఉండును జ్ఞాపకం
- చేయును పరీక్ష ఉత్తీర్ణం

Available in all Medical Shops




జ్ఞాపక శక్తిని పెంచి మానసిక వికాసాన్ని కల్గిస్తుంది

DECCAN AYURVEDASHRAM PHARMACY LTD.
Saidabad, Hyderabad-500 059, A.P.
bajaj group

ప్రయాణమౌతుంటే కాఫీ చేతికిచ్చి జ్యోతి పక్కనే ఆనుకుని కూర్చుంది. "అమ్మా! నీ సూత్రాల గొలుసు అయిదు కాసుల్ది కదా, దాన్తో నీకేం పని ఇంక, నా కూతురి కిచ్చెయ్యగాదూ!"

పలమారిన కాఫీని తాపీగా గుటకవేసి కూతురి తల నిమురుతూ నవ్వింది మధుర. ఆ నవ్వులో ఏం కన్పించిందో జ్యోతి మొహం చిన్నబుచ్చు కుంది. "ఏమైనా, నాన్నగారు పోయాక నవ్వులెక్కు వయ్యాయిలే" అంది విసురుగా లేచి వెళ్లిపోతూ. "మనవరాలి మీద ఉత్తుత్తి ప్రేమలే కాబోలు."

"మధురా! ఒంటరిగా ఉండలేవు. నిన్ను చూడాల్సిన బాధ్యత నీ కొడుకుది. నువ్వు వాడి దగ్గరకే వెళ్లు. తిట్టినా తుమ్మినా నా బతుకిక్క డిలా వెళ్లమారిపోతుందిలే" అంది కళ్లనీళ్లు పెట్టుకుంటూ తల్లి.

మధుర కొడుకు ఇంటికెళ్లి రెండు రోజులుంది.

కొడుకు కోడలి మాటను జవదాటకపోవడం, భార్యను తీసుకుని స్కూటరు మీదో కారు మీదో ఎటైనా వెళ్లిరావడం, ఇంట్లో ఉన్నంతసేపూ ఆ అమ్మాయి వెంట వెంట తిరగడం - మధుర మనసులో ఎక్కడో ముళ్లు గుచ్చుకుంటున్న ట్లవుతోంది. మధురకి అర్థమైంది. తన జీవితంలో దేన్నైతే కోల్పోయిందో అది కోడలికి లభిస్తూంటే అసూయ ముళ్లు గుచ్చుతోందనీ, ఈ హృదయాన్ని అదుపులో పెట్టకపోతే అది ఉత్త ముళ్లపందిలా తయారవుతుందని. తల్లి వెళ్తానని బయలు దేరుతూంటే - "అదేంటమ్మా, నువ్విక్కడే ఉంటావనుకున్నాను. ఆ రోజు ఏదో మూడ్‌లో అలా మాట్లాడానని కోపం రాలేదు కదా? అయినా పల్లెలాంటి ఆ ఊళ్లో అలవాటైన దానివి ఇక్కడుండటం కష్టంలే" అన్నాడు కిరణ్. "నాన్నగారు పోయేసరికి బాంకులో అయిదు వేలున్నాయి కదా. అవి అయిపోయాక ఉత్తరం రాయి... నెలనెలా ఎంతో కొంత పంపిస్తూంటాలే. అన్నట్లు నీ దగ్గర నానుతాడు ఉండాలి కదా- బంగారం కోసం ప్రాణాలు తీసే రోజులివి. ఒక్కదానివీ ఉంటావు జాగ్రత్త." మధురకి మళ్లీ నవ్వొచ్చింది.

మధుర ఊరు చేరుకుంటూనే నానుతాడు అమ్మేసింది. కొంత ఖర్చు పెట్టి బేబీ కేర్ సెంటర్‌కి కావాల్సిన పరికరాలన్నీ కొన్నది. కాస్త విశాలమైన ఇల్లు తీసుకుంది.

వయసు మళ్లి, బిడ్డలు చూడక బాధపడుతున్న నలుగుర్ని చేర్చుకుని వాళ్లకి తిండీ బట్టా సమకూర్చి ఆదుకుంది. వృద్ధాప్యంలో వాళ్లకి తిండీ బట్టాకన్నా ముఖ్యమైనది ఒక చల్లని మాట పలకరింపు అని మధురకి తెలుసు కాబట్టి వాళ్లనెంతో ఆప్యాయంగా చూస్తోంది. ఆ ఖర్చులకు డబ్బుకోసం బేబీ కేర్ సెంటర్ ప్రారంభించింది. నలుగురు నిరుద్యోగులైన అమ్మాయిలకు పని కల్పించింది. పగలంతా పసిపాపల నవ్వులు - ఏడుపులతోనూ, రాత్రులు వృద్ధుల కబుర్లతోనూ మధుర ఇల్లు మార్మోగుతోంది. ఒంటరి తనం ఆమె కిప్పుడు ఆమడ దూరంలో ఉంటోంది.

ఆ రోజు మధుర కాస్త తీరిక చేసుకుని తల్లికి ఉత్తరం రాసింది - "అమ్మా! పసిపాపల, వృద్ధుల బోసినవ్వులకు నిలయమైంది. న న్నిప్పుడు ఒంటరితనం బాధించడం లేదు. నీ మనవరాలికి నీ అవసరం తీరిందనుకున్నాక నువ్వూ ఈ పాపల్లో ఓ పాపాయిగా నా సేవలందుకుంటే సంతోషిస్తాను.

ప్రేమతో,

నీ మధుర."

తెలుగు సాహిత్యాభిమానుల కోసం సరికొత్త శీర్షిక

# "సాహిత్య పరిచయం"

ఇందులో మూడు తమాషాలు

క్విజ్, ఓ మంచి పద్యం, అర్థాలే వేరులే

నిర్వహణ : డాక్టర్ నీరజ

ఆల్ కరెక్ట్ ముగ్గురికి లాట్ ద్వారా బహుమతులు

త్వరలో...